ఆంధ్ర జనసంఘం ఏర్పాటు

1921, నవంబర్ 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో నిజాం సంస్థాన సాంఘిక సంస్కరణ సభ సమావేశాలు జరిగాయి. దీనికి మహర్షి కార్వే అధ్యక్షత వహించారు. ఈ సమావేశాల్లో ఆలంపల్లి వెంటక రామారావు అనే న్యాయవాది తెలుగుభాషలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించడానికి ప్రయత్నించారు. దీన్ని మహారాష్ట్రులు, ఇతర తెలుగేతరులు తీవ్రంగా వ్యతిరేకించారు. తెలుగు భాషలో ప్రసంగించరాదంటూ అవహేళన చేశారు. దీంతో తెలుగు ప్రజల ప్రధాన నగరంలోనే తెలుగుకు అవమానం జరగడం ఆంధ్రుల్ని ఖిన్నుల్ని చేసింది. సభావేదికపై నుంచి మాడపాటి హనుమంతరావు, మందుముల నర్సింగరావు, మందుముల రామచంద్రరావు, మట్టా లక్ష్మీనరసయ్య, బూర్గుల వేంకటేశ్వరరావు తదితరులు మౌనంగా వేదిక దిగిపోయారు.

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన వారు వెంటనే సమావేశమై 1921, నవంబర్ 12న ఆంధ్ర జన సంఘంను 12 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. అందులో మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి ప్రముఖులు ఉన్నారు. ఈ సంఘ ప్రథమ సమావేశం 1922, ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లో కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమేశంలోనే ఆంధ్రజన సంఘం పేరును నిజాం సంస్థాన ఆంధ్ర జన సంఘంగా మార్చారు. ఈ సంఘానికి అధ్యక్షుడు ఆర్.రాజగోపాలరెడ్డి కాగ, కార్యదర్శి మాడపాటి హనుమంతరావు. అప్పట్నుంచి తెలంగాణా ప్రజానీక సాంఘిక సాంస్కృతిక పునరుజ్జీవ నోద్యమంలో చురుకైన పాత్ర వహించాను మాడపాటి.

తెలుగువారిలో సాంఘిక సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం ఆంధ్రజన సంఘం కింది లక్ష్యాల సాధనతో ముందుకెళ్లింది.

1) ప్రజల్లో జన సంఘ ఆశయాల వ్యాప్తి కోసం సంచార కార్యకర్తల్ని నియమించడం
2) ప్రజల దైనందిన సమస్యల్ని గురించి కరపత్రాలు, వివరణ పత్రాలు ప్రచురించడం
3) తెలుగు పండితులకు ప్రోత్సాహాన్ని కల్పించడం
4) తెలుగు గ్రంథాలయాలు, పఠనశాలలు, ప్రైవేటు పాఠశాలలు నెలకొల్పడం
5) ఆంధ్ర ప్రజల చరిత్రను వెలుగులోకి తెచ్చే చారిత్రక గ్రంథాలయాల్ని, శాసనాల్ని సేకరించడం
6) ఆంధ్ర భాషా ప్రచారానికి అవసర సహాయం అందజేయడం

ఈ లక్ష్యాల సాధనలో భాగంగా ఆంధ్ర జన సంఘం ప్రచురించిన అనేక గ్రంథాలు ప్రజా చైతన్యానికి దోహదపడ్డాయి. నిజాం ఆంధ్ర రాష్ట్ర ప్రశంస అనే గ్రంథంలో తెలుగు వారి ప్రాచీన వైభవం, చారిత్రక ప్రాముఖ్యం వివరించి ఉంది. నిజాం రాష్ట్రాంధ్రుల అభివృద్ధికి మార్గాల్ని సూచిస్తూ కూడా పుస్తకాల్ని ప్రచురించడం జరిగింది.

కాకతీయ చరిత్రపై వరంగల్‌లో 1930లో ఒక గోష్టి జరిగింది. దీని ఫలితంగా కాకతీయ సంచిక అనే చారిత్రక సంచిక ప్రచురితమైంది. ఆంధ్ర జన సంఘం 'వర్తక స్వాతంత్ర్యం' అనే పుస్తకాన్ని ప్రచురించింది. అప్పట్లో గ్రామాల్లో, జిల్లాల్లో పర్యటించే ప్రభుత్వాధికారులు వర్తకుల్ని ఏదో ఒక నెపంతో కొల్లగొట్టేవారు. ఈ గ్రంథం ద్వారా వర్తకుల్లో ధైర్యాన్ని నింపారు. ఆంధ్ర జన సంఘం తమకు కల్పించిన ఈ ప్రోత్సాహంతో తెలంగాణా వర్తకులు అధికారులను ధైర్యంగా ఎదుర్కొని ఒక వర్తక సంఘంగా ఏర్పడ్డారు. ఇలా 'సర్బరాహి' (వర్తకుల్ని అధికారులు కొల్లగొట్టే విధానం) తగ్గింది.

వెట్టిచాకిరిని నిరసిస్తూ ప్రచార కార్యక్రమాల్ని తీవ్రగతిలో సాగించి బలూతావార్‌ల విమోచనం కోసం ఆంధ్ర జన సంఘం కృషి చేసింది. ఈ సంఘ కృషి ఫలితంగా నిజాం ప్రభుత్వం 1923లో ఫర్మానా జారీ చేసి బలూతాదారుల చాకిరీ చేయించుకునే అలవాటును నిషేధించింది.

1925లో మధిరలో గ్రంథాలయ సంఘాల ప్రథమ సమావేశం జరిగింది. ఆంధ్ర జన సంఘం కృషి ఫలితంగా 1928లో ఆంధ్ర బాలికోన్నత పాఠశాల ఏర్పాటైంది. బోధనా భాషగా తెలుగును విద్యనభ్యసించిన తొలి విడత మహిళలు 1934లో మెట్రిక్ పరీక్షకు అనుమతి పొందారు.